క్లుప్తంగా

రేపు భువనేశ్వరీదేవికి అధివాస మహోత్సవం



భువనేశ్వరీ అమ్మవారు

డాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా సబ్బవరం మండలం యాతపాలెంలో వెలసిన భువనేశ్వరీ దేవికి ఆగస్టు 4న అధివాస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు భువనేశ్వరీ పీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారికి పూజలు నిర్వహించే భక్తులు చీర జాకెట్టు, కుంకుమ తదితర పూజా సామగ్రితో విచ్చేసి పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.

బహిరంగ వేలం వాయిదా

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటనలో వేలం ఎప్పుడు నిర్వహించేదీ తెలుపుతామని, పూర్తి వివరాలకు జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

డాబాగార్డెన్స్ : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర రెల్లి సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువసేన అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావు, చొక్కాకుల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ రెల్లీలకు ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, రెల్లి కులస్థుల్లో చదువుకున్న వారు అధికంగా ఉన్నందున 3 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

పింగళికి ఘన నివాళి



పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ మేరకు సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎం ఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్, పలువురు ప్రముఖులు ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గజపతిస్వామి, జి. లక్ష్మణ్, యు. ఎల్లాజీ, పి. అప్పలకొండ, డి. సత్తిబాబు, పి. సత్యవంతరావు, సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, సుజాత, రాణి, కనకమహాలక్ష్మి, రాజేశ్వరి, రమాప్రియ, జనని, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

చల్లగాలితో ఉపశమనం



మేఘమాలికల నడుమ జగదాంబ వద్ద గల క్లాక్ టవర్

డాబాగార్డెన్స్ : ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడిన నగర జీవి.. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు రావడంతో ఉపశమనం పొందాడు. నల్లటి మేఘాలకు.. చల్లటి గాలులు తోడవ్వడంతో సేదదీరాడు. జగదాంబ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన క్లాక్‌టవర్ నల్లటి మేఘాలకు మరింత అందంగా కనిపించింది.



ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థుల గ్రూప్ డిస్కషన్



పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులు

చదువుల వనం

- విద్యార్థులకు ఉపయోగపడుతున్న డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సెంట్రల్ పార్క్
- పోటీ పరీక్షలకు.. గ్రూప్ డిస్కషన్లకు వేదికగా నిలుస్తున్న వైనం

సాధారణంగా పార్క్ అంటే పిల్లలు ఆడుకునేందుకు.. పెద్దవారు సేదదీరేందుకు ఉపయోగపడుతుందని అనుకుంటాం. ఎక్కడి పార్కులైనా మనకు ఇలాగే కనిపిస్తాయి. పిల్లలు ఆడుతూ.. పెద్దవాళ్లు వాకింగ్ చేస్తూనో.. వ్యాయామాలు చేస్తూనో కనిపిస్తారు. కానీ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూతవేటు దూరంలో ఉన్న డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పార్కు మాత్రం పిల్లల ఆటలు.. పెద్దవాళ్ల వ్యాయామాలతో పాటు ఏకాగ్రతతో చదివే విద్యార్థులకు కూడా ఉపయోగపడుతోంది. ఇక్కడి పచ్చని ప్రకృతి.. ప్రశాంత వాతావరణం వారి చదువులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

డాబాగార్డెన్స్ : ఏ పని తలపెట్టినా ఏకాగ్రత అవసరం. ఉన్నత చదువులు చదవాలన్నా.. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నా పట్టుదల ముఖ్యం. మనిషి తన లక్ష్యాన్ని చేరాలన్నా.. ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నా.. పట్టుదల, ఏకాగ్రత ఎంతో అవసరం. నగర నడిబొడ్డున వుడా ఏర్పాటు చేసిన ఆ పార్క్ ఏకాగ్రతతో చదవాలనుకునే విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతోంది. అదే.. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సెంట్రల్ పార్క్.

ఎంతో మంది పోరాటాల ఫలితంగా నగర నడిబొడ్డున వైఎస్సార్ పార్క్ ఏర్పడింది. సువిశాల ప్రాంగణంలో వుడా ఏర్పాటు చేసిన సిటీ సెంట్రల్ పార్క్ (వైఎస్సార్ పార్క్) చదువులకు నిలయంగా మారింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూత వేటు దూరంలో ఈ పార్క్ ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు ఇక్కడి ప్రశాంత వాతావరణంలో చదువుకుంటూ మనకు కనిపిస్తారు. ఈ పార్క్‌లో పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు చదివే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది. ఈ పార్క్‌లో నిత్యం వందలాది మంది విద్యార్థులు చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల ఇంటర్వ్యూలకు వెళ్లే విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్లు చేసుకోవడానికి, మౌఖిక పరీక్షల సాధన చేసేందుకు కూడా ఉపయోగపడుతోంది. ఇప్పటికే ఈ పార్క్‌లో చదివిన పలువురు విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన సందర్భాలూ ఉన్నాయి. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. తిరిగి మధ్యాహ్నం 3 నుంచి పొద్దుపోయే వరకు ఇక్కడే చదువుతున్నారు. వీరిలో చాలా మంది మధ్యాహ్నం కూడా ఇంటికి వెళ్లకుండా.. పరిసర ప్రాంతాల్లో టిఫిన్ చేసి ఇక్కడే కొంత సేపు సేదదీరి తిరిగి చదువుల్లో నిమగ్నమవుతున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులైతే.. కళాశాలకు వెళ్లే ముందు ఓ గంట.. కళాశాల విడిచిపెట్టిన తర్వాత ఓ గంట చదువుకునేందుకు ఇక్కడికి వస్తున్నారు.



పార్కులో ఏకాగ్రతతో చదువుతున్న విద్యార్థి

అందరికీ ఉపయుక్తమే..

విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడే వైఎస్సార్ పార్క్ అన్ని వర్గాల వారికి ఉపయుక్తంగా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడి ఆస్పత్రులకు వచ్చే అనేక మందికి ఈ పార్క్ ఆసరాగా నిలుస్తోంది. అలాగే వివిధ పనుల మీద విశాఖ వచ్చే వారికి కూడా ఈ పార్క్ షెల్టర్ కల్పిస్తోంది.

న్యాయవాదులకు మార్గదర్శకం 'బైపా'

డాబాగార్డెన్స్ : ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా తన జీవితాన్ని అంకితం చేయడమే కాక న్యాయవాదులకు మార్గదర్శకం బైపా అరుణ్‌కుమార్ అని రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. సమాజంలో న్యాయవాదుల పాత్ర అనే అంశంపై శుక్రవారం డాబాగార్డెన్స్‌లో గల బీకేపీ చాంబర్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తానూ, బైపా అరుణ్‌కుమార్ ఎంతో కాలంగా కలిసి న్యాయవాద వృత్తిలో పని చేశామని, ఆయన క్రమశిక్షణ గల వ్యక్తి అని కొనియాడారు. బైపా వద్ద అనేక మంది జూనియర్లు శిక్షణ పొంది ఎంతో మంది జడ్జీలుగా రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారంటే అది ఆయన కృషికి నిదర్శనమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి న్యాయవాది తన వృత్తిలో కృషితో ఎదగాలన్నారు. అందరూ జడ్జీలు అయిపోరాదని, సమాజం కోసం న్యాయవాద వృత్తిలో పేరు సంపాదించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బైపా అరుణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ఐఎం అహ్మద్, న్యాయవాదులు డాక్టర్ తిగురుపల్లి బోసుబాబు, గుడిపల్లి సుబ్బారావు, వాగుపల్లి చిన్నారావు, ఫసీయుద్దీన్, శారద, సంపత్, జార్జి బంగారయ్య, కార్పొరేటర్ కేవీఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.



బైపాను సత్కరించిన అనంతరం మాట్లాడుతున్న కృష్ణమోహన్

ఫిషింగ్ హార్బర్‌పై దృష్టి



హార్బర్‌ను సందర్శించిన డీసీపీ-2 ఏసీపీ మోజెస్ పాల్

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌పై పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల హార్బర్‌లో నేరాల సంఖ్య, ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. ఈ పరిణామాలను స్వయంగా పరిశీలించేందుకు శుక్రవారం డీసీపీ-2 తుహిన్ సిన్హా హార్బర్‌లో పలు ప్రాంతాలను సందర్శించారు. అక్కడి పరిస్థితులను ఏసీపీ మోజెస్ పాల్ డీసీపీ-2కి వివరించారు. హార్బర్‌లో పెరుగుతున్న ట్రాఫిక్‌కు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై డీసీపీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.భాస్కరరావు, పోలీసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని ఒక యువకుడి మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. వివరాలిలా.. తాటిచెట్లపాలెం 28 బస్టాప్ దరి సుమారు 32 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉన్నాడు. అటువైపు వెళ్తున్న బ్లూకోట్స్ కానిస్టేబుళ్లు.. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్‌కు సమాచారమిచ్చారు. యువకుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఫోర్త్‌టౌన్ సీఐ నంబర్ 94407 96012కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

రుతుక్రమ సమస్యలపై విద్యార్థినులకు అవగాహన

డాబాగార్డెన్స్ : కౌమార దశలో విద్యార్థినులు రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని అక్షయ ఐవీఎఫ్ సెంటర్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష సూచించారు. విశాఖ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు శిరీష మాట్లాడుతూ ఇటీవల జీవన విధానాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, వీటి నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ, సీనియర్ లెక్చరర్ ఉదయశ్రీ, మ్యాన్‌కైండ్ ఫార్మా సభ్యులు, అధిక సంఖ్యలో బాలికలు పాల్గొన్నారు.



బాలికలకు సూచనలు చేస్తున్న డాక్టర్ శిరీష

డస్ట్‌బిన్లను శుభ్రం చేయాలి

జగదాంబ : వార్డుల్లో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లను పరిశుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన జోన్ పరిధిలో పర్యటించారు. రహదారి పక్కన డస్ట్‌బిన్లలోని చెత్త తరలించకపోవడంతో అపరిశుభ్రత ఆవరించి ఉండటం ఆయన గమనించారు. వెంటనే పారిశుధ్య సిబ్బందితో చెత్తను శుభ్రం చేయించి క్లాప్ వాహనాల్లో తరలింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అన్ని ప్రాంతాల్లో ఉన్న డస్ట్‌బిన్లను శుభ్రపరచాలన్నారు. వర్షాకాలం కావడంతో డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, జనావాసాల్లో చెత్తకుప్పలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



చెత్తను ఎత్తించి శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

గంటలో దొంగను పట్టుకున్న పోలీసులు

విశాఖ సిటీ : ఆటోలో ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాన్ని కొట్టేసిన వ్యక్తిని గంటలోనే పోలీసులు పట్టుకుని బాధితురాలికి నగ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం దొండపర్తి ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న లలితా జ్యుయలర్స్‌లో పావుతులం బంగారు ఆభరణం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ నగను కొట్టేశాడు. దీంతో ఆమె వెంటనే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీపీ (క్రైమ్) వెంకటరత్నం పర్యవేక్షణలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గంటలోనే ఆ వ్యక్తిని పట్టుకుని నగ స్వాధీనం చేసుకున్నారు. దాన్ని సీపీ చేతుల మీదుగా బాధితురాలు వరలక్ష్మికి శుక్రవారం అందజేశారు.



మహిళకు ఆభరణం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

జగదాంబ : పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తే తల్లిదండ్రులకు తెలియపరుస్తారన్నారు. దీని వల్ల ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రం అవుతాయన్నారు. ఫలితంగా వ్యాధుల నుంచి రక్షణ పొందుతామని అన్నారు. ముఖ్యంగా ఇంట్లో పిల్లలే నీళ్ల నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా దోమలు లార్వాలు పెట్టకుండా ఉంటాయన్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో జోన్ పరిధిలో అన్ని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులు వారి ఇళ్లతో పాటు వీధిలో అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన.. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

సీతమ్మధార : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ రానురాను సంక్షేమ కళాశాలల హాస్టళ్లలో సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. విశాఖ జిల్లావ్యాప్తంగా 18 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉండగా దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప మిగతా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. అలాగే హాస్టళ్లలో సరైన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులే బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధలు పడుతున్నారన్నారు. గతంలో పాత బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తాం అని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సకాలంలో మెస్ బిల్లులు విడుదల కాక మెనూ అమలు చేయలేమని వార్డెన్లు తెగేసి చెబుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్. రుద్రి, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, లక్ష్మణ్, సతీష్, మధు, లోకేష్, జానకి, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

రవికృష్ణరాజు సేవలు నిరుపమానం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన ఇంజినీరుగా నగరానికి ఆదర్శనీయమైన సేవలందించి, అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేసిన రవికృష్ణరాజు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన రవికృష్ణరాజు సత్కార సభ అధికారులు, ఇంజినీర్లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రవి కృష్ణరాజు మంచి విద్యావంతులని, సానుకూల వైఖరి కలవారని జీవీఎంసీలో ప్రధాన ఇంజినీరుగా మూడేళ్ల పాటు విధులు నిర్వహించి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. మిలాన్, గిరి ప్రదక్షిణ, చందనోత్సవం తదితర ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నగరంలో విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. మున్సిపల్ ఇంజినీర్‌గా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసి తనదైన ప్రత్యేక ముద్ర వేశారని, జీవీఎంసీలో కూడా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. 36 ఏళ్లుగా ప్రభుత్వానికి సేవలందించి ఉద్యోగ విరమణ చేసినందుకు అభినందిస్తూ, శేష జీవితం ఆనందంగా కుటుంబంతో గడపాలని ఆకాంక్షించారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు నుంచి చాలా నేర్చుకున్నామని, ఎటువంటి సమస్యకైనా ఆయన వద్ద పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం జీవీఎంసీ అధికారులు, ఇంజినీర్లు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.



రవికృష్ణరాజును సత్కరిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

బారులు తీరిన భారీ వాహనాలు

- రహదారులపై అనధికార పార్కింగ్
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి



కంచరపాలెం-జ్ఞానాపురం రహదారిలో భారీ వాహనాల రాంగ్ పార్కింగ్



మరమ్మతుల నిమిత్తం రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన భారీ లారీలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 కంచరపాలెం-జ్ఞానాపురం పరిధిలో భారీ వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారులపై అనధికార పార్కింగ్‌తో స్థానిక ప్రజలు, వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గత రహదారులపై భారీ లారీలు, ట్రావెల్స్ బస్సులను పార్క్‌చేసి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో భారీ వాహనాలను నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్డుకిరువైపులా రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నెలలు తరబడి రోడ్లపై వాహనాలను వదిలేయడంతో చెత్తాచెదారం, మట్టి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఆ ప్రాంతంలో శుభ్రం చేయడం కష్టతరంగా మారడంతో పారిశుధ్య సిబ్బంది రోడ్లను ఊడ్చే పనులను వదులుకున్నారు.

ట్రాఫిక్ జామ్

కంచరపాలెం నుంచి జ్ఞానాపురం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలను ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నా.. పట్టించుకునే వారు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి భారీ వాహనాల అనధికార పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

వాహనాలను తరలించాలి

జ్ఞానాపురం-కంచరపాలెం రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపి ఉంచిన భారీ వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణించే వాహనాలకు ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలి.

– జయప్రకాష్, సెబాస్టియన్ కాలనీ

జోనల్ అధికారులు స్పందించాలి

జోన్-5 పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాల పార్కింగ్, మరమ్మతులు చేపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి వాహనాల రాంగ్ పార్కింగ్‌ను అరికట్టాలి.

– పి.రవికుమార్, బాబూ కాలనీ